క్లుప్తంగా

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో అఖిలపక్ష నేతలు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో కొనసాగుతున్న దీక్షలు ఆదివారం నాటికి 49 రోజులకు చేరుకున్నాయి. గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే డివిజన్ మంజూరు చేయాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. ఈ విషయమై ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని వారు ప్రకటించారు. కులసంఘాలు, యువజన సంఘాలు, వ్యాపారులు దీక్షలకు మద్దతు ప్రకటించారు.

నేడు సీఎం కప్ టోర్నమెంట్ ప్రారంభం

నర్సాపూర్: సీఎం కప్ టోర్నమెంట్ పోటీలు ఈనెల 15 నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీఓ మార్టిన్‌లూథర్, ఎంఈఓ బుచ్యానాయక్ తెలిపారు. 15న ఉదయం 9 గంటలకు స్థానిక గిరిజన గురుకుల విద్యాలయం ఆవరణలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రారంభిస్తారని వారు వివరించారు. క్రీడా పోటీల్లో పాల్గొన దలచిన క్రీడాకారులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

బీటీరోడ్డు ధ్వంసం



వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మానెపల్లి పంచాయతీ పరిధిలోని గూడెంకు వెళ్లే ప్రధాన దారి మొత్తం బీటీ తేలింది. గ్రామానికి చేరుకోవడానికి ఉన్న ఏకైక మార్గం కంకరతేలి గుంతలమయం కావడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలినడకన వెళ్లడానికి సైతం ఇబ్బందిగా మారిందన్నారు. అదేవిధంగా మూలమలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, మరమ్మతులు చేపట్టాలని కోరారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్



చెత్తను తొలగిస్తున్న గ్రామస్తులు

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని నాలుగో వార్డులో ఆదివారం 359వ వారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో పిచ్చి మొక్కలను తొలగించి రోడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మన్నే మహాదేవి, వార్డు సభ్యులు మన్నే మమత, అబ్జల్ బీ, గ్రామపంచాయతీ సిబ్బంది మేకిన్ యువత, గ్రామ పెద్దలతో పాటు పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు సైతం పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ఘట్టాభిషేకం చేస్తున్న దృశ్యం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని ఫతేనగర్ వీధిలోని వేంకటేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం 108 శత ఘట్టాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు నరేంద్రచార్యులు, ఆలయ వంశానుగ్రత ధర్మకర్త కంచి మధుసూదన్ పాల్గొన్నారు.

16న ఉపకులాల పోరాట సమితి సమావేశం

నర్సాపూర్: ఈనెల 16న ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశం సిద్దిపేటలో ఏర్పాటు చేసినట్లు హోళియదాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి చెప్పారు. 16న సమావేశం సిద్దిపేటలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎస్సీ ఉపకులాలకు చెందిన సంఘం సభ్యులు సమావేశానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హనుమాన్ ఆలయాల్లో పూజలు



మెదక్ మున్సిపాలిటీ: పూజలకు హాజరైన మాధవానందస్వామి



కొల్చారం(నర్సాపూర్): హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఆంజనేయస్వామి దేవాలయాలను పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ విగ్రహాలు, చిత్రపటాలతో భక్తులు శోభాయాత్రలు చేపట్టారు. కోదండ రామాలయం, ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు భాష్యం మధుసూదనచార్యుల, కృష్ణారావు శర్మ, శుక్లా ఆధ్వర్యంలో ఉదయం హనుమంతుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చాలీసా పారాయణం, భజన కీర్తనలు ఆలపించారు. ఈ వేడుకల్లో వేద పండితులు కృష్ణమూర్తి శర్మ, ప్రభాకర్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ బండ నరేందర్ సభ్యులు పురుషోత్తం, నందిని శ్రీను, బద్రినాథ్, భక్తులు పాల్గొన్నారు. నర్సాపూర్: నర్సాపూర్‌లోని బస్టాండ్ సమీపంలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయ అర్చకుడు హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి 108 లీటర్ల చెరుకు రసంతో దేవునికి అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించడంతో పాటు పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నర్సాపూర్ రూరల్: మండలంలోని పెద్దచింతకుంట జల హనుమాన్ ఆలయంలో హనుమాన్ మాలాధారణ స్వాముల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి యాదగౌడ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అశోక్ గౌడ్, ప్రభుగౌడ్, మల్లేశ్‌గౌడ్, నరేశ్‌యాదవ్, నర్సింలు స్వామి, పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రగతి ధర్మారం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో జరిగిన పూజల్లో గ్రామస్తులు పాల్గొన్నారు.



మెదక్ మున్సిపాలిటీ: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా హనుమాన్ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగంపేటలో హనుమాన్ దేవాలయంలో ఉదయం హనుమంతుడికి మూలవిరాట్ విగ్రహానికి అభిషేకం, చందనోత్సవం, ప్రత్యేక హారతి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి వారి ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మెదక్ రూరల్: మండలంలోని మాచవరం గ్రామంలో 20 అడుగుల ఎత్తైన హనుమంతుని విగ్రహాన్ని సర్పంచ్ సంధ్యారాణి, శ్రీనివాస్ చౌదరి ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): మండలంలోని పాతలింగాయపల్లిలో, పాపన్నపేటలో హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పాత లింగాయపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దత్తురాజు, సర్పంచ్ నవీన్‌గౌడ్, అర్చకుడు దిగంబర్ పంతులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం చిన్నశంకరంపేట హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజల్లో వెంకట్రాములు చారి, దర్జీ రమేశ్, వెంకన్న, శ్రీనివాస్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.



మెదక్ రూరల్: మాచవరంలో..

చేగుంట(తూప్రాన్): మండలంలోని చెట్లతిమ్మాయిపల్లిలో శివ పంచాయతన అభయాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్‌నాయక్, ఎంపీటీసీ హోలియానాయక్, నాయకులు అంజాగౌడ్, పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



నర్సాపూర్: ప్రసన్నాంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



రామాయంపేట(మెదక్): ప్రగతి ధర్మారంలో..



పాపన్నపేట(మెదక్): కొత్తలింగాయపల్లిలో ..



చేగుంట(తూప్రాన్): హనుమాన్ పూజల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు



చిన్నశంకరంపేట(మెదక్): హోమం నిర్వహిస్తున్న భక్తులు



నర్సాపూర్ రూరల్: పెద్దచింతకుంటలో..

గ్రామ దేవతలకు బోనాలు

తూప్రాన్: మండలంలోని నర్సంపల్లిలో గ్రామంలో ఆదివారం ఘనంగా గ్రామదేవతలకు బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతీ కుటుంబం నుంచి బోనాలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. అలాగే బుధవారం నుంచి పెద్దమ్మతల్లికి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సత్యనారాయణ, గ్రామస్తులు తెలిపారు.



బోనాలతో భక్తులు

సీఎం కప్‌కు ఏర్పాట్లు



గ్రౌండ్‌ను చదును చేస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): సోమవారం నుంచి ప్రారంభం కానున్న సీఎం కప్ క్రీడాపోటీలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడురోజుల పాటు జరగనున్న క్రీడలకు గాను మండల కేంద్రమైన కౌడిపల్లి ఉన్నత పాఠశాలలోని గ్రౌండ్‌ను ట్రాక్టర్ డోజర్‌తో చదును చేశారు. ఈనెల 15, 16, 17వ తేదీల్లో సీఎం కప్ క్రీడల సందర్భంగా వాలీబాల్, కబడీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్న ఎంపీడీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థికసాయం



రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని జప్తి శివనూర్‌లో నిరుపేద వృద్ధురాలు గోరీబీ ఆదివారం మృతి చెందగా, ఆమె కుటుంబ సభ్యులను మైనంపల్లి సోషల్ సర్వీసెస్ ప్రతినిధులు పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మైనంపల్లి రోహిత్ ఆదేశాల మేరకు తాము మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. పదివేలు అందజేశామని సర్పంచ్ షేక్ షరీఫ్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు రుక్మొద్దీన్ పేర్కొన్నారు. వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరపతిరెడ్డి ట్రస్ట్ సభ్యులు కూడా మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

◆ మంచి మాంసం అమ్మకాలు జరిగేలా చూడాలి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో మంచి మాంసం అమ్మకాలు జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. కిలో బరువు లేని కోళ్ల మాంసాన్ని వ్యాపారులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆరోగ్యకర కోళ్ల మాంసం అమ్మకుండా పలువురు ఇష్టరాజ్యంగా అనారోగ్యానికి గురైన కోళ్ల మాంసం విక్రయాలకు పాల్పడుతున్నట్లు పలువురు కొనుగోలుదారులు ఆరోపించారు. మటన్ అమ్మకాలు సైతం సంబంధిత పశు వైద్యాధికారి నిర్ధారించిన మేకలు, గొర్రెలు అమ్మకాలు జరిగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

◆ వివాహ వేడుక



అల్లాదుర్గం(మెదక్): మండలంలోని అప్పాజీపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మహేశ్, పూజ వివాహం ఆదివారం జరిగింది. ఈ వివాహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరై వధువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు బసన్నగారి బల్‌రాం, సాయిలు, సత్యనారాయణ, బాలకిషన్ తదితరులు ఉన్నారు.

పరామర్శ



శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాధవరెడ్డిని ఆదివారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన మాధవరెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు హన్మంత్‌రెడ్డి, లాయక్, వీరేశ్, కుంట లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవం



మెదక్ రూరల్: పూజలు చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మెదక్ రూరల్: హవేళిఘనాపూర్ మండల కేంద్రంలోని నల్ల పోచమ్మ ఆలయం విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు స్వాగతం పలకగా హోమం చేసి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, సర్పంచ్ సవిత శ్రీకాంత్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఎంపీటీసీ మంగ్య, మేకల సాయిలు, శ్రీపాల్, రాజిరెడ్డి, లక్ష్మణ్‌రావు, ప్రతాప్‌రెడ్డి, నాగరాజు, గణపతి, రామచంద్రారెడ్డి, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మ ఆలయంలో భక్తులతో సందడి నెలకొంది. ఆదివారం వివిధ జిల్లాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివ్వప్ప, రాజేష్‌లు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు మంచినీరు, వసతితోపాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని తొనిగండ్ల గ్రామ శివారులో ఉన్న హనుమాన్ ఆలయాన్ని ఆదివారం ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి సందర్శించి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఎమ్మెల్సీని సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మాపూర్ ఎంపీటీసీ నాగులు, ఆలయ కమిటీ ప్రతినిధులు సిద్ధరాంలు, తిర్మలయ్య, దామరచెరువు సర్పంచ్ శివప్రసాదరావు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి పుట్టి అక్షయ్‌కుమార్, పాల్గొన్నారు.

రైస్‌మిల్లు తనిఖీ



రైస్ మిల్లర్లతో మాట్లాడుతున్న ఎంపీ

రామాయంపేట(మెదక్): రైస్‌మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యం లారీలను వెంటవెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. నర్సింగ్ మండల కేంద్రంలో కొందరు రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నందున ఆయన ఆదివారం పలు రైస్ మిల్లులను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఇప్పటికే వర్షాలతో రైతులు నష్టానికి గురైనారని, వారిని ధాన్యం తీసుకోవడంలో ఇబ్బందులు గురి చేయొద్దని ఆయన సూచించారు. ఈ విషయమై ఎంపీ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఎంపీ వెంట నార్సింగి జెడ్పీటీసీ కష్టారెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బాబు, సహకార సంఘం చైర్మన్ శంకర్ గౌడ్, జిల్లా నాయకులు రాజేశ్, తౌర్య నాయక్ పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మె విరమణ: విధుల్లో చేరిక



ఎంపీడీఓ సమక్షంలో విధుల్లో చేరుతున్న కార్యదర్శులు

కొల్చారం(నర్సాపూర్): తమను రెగ్యులరైజ్ చేయాలంటూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 16 రోజులుగా చేస్తున్న సమ్మెకు తెరపడింది. సమ్మెను వీడి విధుల్లోకి చేరకుంటే తాత్కాలికంగా కొత్తవారికి అవకాశం ఇస్తామంటూ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో కొల్చారం మండల వ్యాప్తంగా పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆదివారం మండల పరిషత్ సమావేశ కార్యాలయానికి వెళ్లి తాము వీధుల్లోకి చేరుతున్నట్లు ఎంపీడీఓ గణేశ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వానికి భయపడి విధుల్లోకి చేరినట్లుగా భావించొద్దని, తమను రెగ్యులరైజ్ చేసే వరకు ఏదో రకంగా నిరసనను తెలుపుతూనే ఉంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

ఘనంగా మదర్స్ డే



కేక్ కట్ చేస్తున్న నర్సులు, ఆయాలు



సునీతారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్: మదర్స్ డేను పురస్కరించుకొని నర్సాపూర్‌కు చెందిన పలువురు యువకులు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆదివారం పలు కార్యక్రమాలు చేపట్టారు. పట్టణానికి చెందిన చైతన్య, శ్యాం, నవీన్, శరత్, శశి తదితరులు ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వ్యక్తులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే నర్సులు, ఆయాలతో కేక్ కట్ చేయించి, అందరికి మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో మాతృదినోత్సవ వేడుకలు నిర్వహించారు. మాతృమూర్తులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునీతాలక్ష్మారెడ్డిని గోమారంలోని ఆమె నివాసంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చిటుక్ల్ మైపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ హన్మంత్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ లాయక్, బీఆర్ఎస్ నాయకులు వీరేష్, సత్యంగౌడ్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అల్లాదుర్గం(మెదక్): రైతులు పండించిన ధాన్యం మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ దుదగొండ కాశీనాథ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరికి మద్దతు ధరతో పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, సర్పంచ్ మల్లేశం, ఉప సర్పంచ్ రమేశ్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింలు, ఎంపీటీసీ దశరథ్, స్థానిక నాయకుడు సాయిబాబా, పీఏసీఎస్ సీఈఓ శివగౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు వసూలు

శివ్వంపేట(నర్సాపూర్): వరికోత సీజన్‌ను ఆసరాగా చేసుకొని దళారులు ఇష్టరాజ్యంగా రైతుల నుంచి డబ్బులు కాజేస్తున్నారు. వరికోతకు యంత్రాల దళారులు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని రైతులు వాపోయారు. చైన్ మిషన్ గంట కోతకు 3500, టైర్ యంత్రం గంటకు 2200 నుంచి 2700 వసూలు చేస్తున్నట్లు పలువురు రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, నిర్దేశించిన ప్రకారం వరికోతకు యంత్రాల యజమానులు వరికోతకు డబ్బులు తీసుకునేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.